క్లుప్తంగా

11న వాహనాల వేలం

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను చిత్తూరులో ఈనెల 11న బహిరంగ వేలం వేయనున్నట్టు స్థానిక సెబ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు స్థానిక సెబ్ కార్యాలయంలో కాషన్ డిపాజిట్‌ను చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

దాడులను ప్రేరేపిస్తే కఠిన చర్యలు

- సీఐ చిన్నగోవింద్

గంగవరం: రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, గొడవలకు ప్రేరేపిస్తే అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ చిన్నగోవింద్ ఆదివారం ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా హింసాత్మక ఘటనలు పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తున్నాయని, అందరూ సంయమనం పాటించాలేగానీ గెలిచామనే అత్యుత్సాహంతో దాడులు, హింసకు పాల్పడరాదని విజ్ఞప్తి చేశారు. అందరూ కలసిమెలసి ఉండాలేగానీ మన ప్రాంతంలో లేని కొత్త పోకడలను తెచ్చి అనవసరంగా వర్గాల మధ్య చిచ్చురేపరాదని, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించరాదని సూచించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం రౌడీయిజం, దౌర్జన్యాలకు ఎవరు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా గంగజాతర



విశ్వరూప దర్శనంలో గంగమ్మ

పలమనేరు: మున్సిపాలిటీలోని గంటావూరు కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారి విశ్వరూప దర్శనం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మాజీ కౌన్సిలర్ సీఎస్ నవీన్‌కుమార్ మిత్ర బృందం అమ్మవారికి నగలను సమర్పించారు. సోమవారం ఉదయం అమ్మవారి జలధితో జాతర పరిసమాప్తమవుతుంది.

భగవద్గీత పారాయణం పిల్లలకు నేర్పాలి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

పలమనేరు: భగవద్గీతను పారాయణం చేయడం పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని, దీనినో బాధ్యతగా భావించాలని స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు భాస్కర్ కోరారు. ఆదివారం మున్సిపాలిటీలోని గొబ్బిళ్లకోటూరులో భగవద్గీతపై ఇంటింటా ప్రచారం చేశారు. గీతలో ఉన్న ఆత్మ, జీవాత్మ, పరమాత్మ..మొదలైన విషయాలను, భగవంతుని దరిచేరడానికి చేయవలసిన పనులను వివరించారు. బాలాజి, వాణిశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తులసీనాథంకు పురస్కారం



తులసీనాయుడుం నాయుడు దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పలమనేరు: పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తులసీనాథం నాయుడికి బైరెడ్డిపల్లెకు చెందిన కళాతరంగిణి సంస్థ నిర్వాహకులు ఆదివారం పట్టణంలోని కళామందిరంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయనకు తెలుగు భాషా సేవా పురస్కారం ప్రదానం చేశారు. మాతృభాషకు ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు కళాతరంగిణి నిర్వాహకులు ఎం.రాజేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో కవులు మాధవరెడ్డి, జేఎస్‌సీ మూర్తి సీతారామయ్య, చంద్రశేఖరయ్య తదితరులులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బండి కుంబాలు

వెదురుకుప్పం: మండలంలోని చెంచుగుడి ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండి కుంబాల కార్యక్రమం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథా కాలక్షేపం జరిగింది. సాయంత్రం బలి కూడుతో బకాసురుని వేషధారి ప్రదర్శనగా వెళ్లి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యజ్ఞానికి ఉభయదారులు నారాయణరెడ్డి, శారాదమ్మ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

ప్రార్థనా స్థలాలను హరిత వనాలుగా మారుద్దాం



చర్చి వద్ద మొక్కలను నాటేందుకు సిద్ధమైన క్రైస్తవులు, దేవేంద్ర

పట్టణంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదులను హరిత వనాలుగా మార్చుదామని పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర కోరారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి 77వ వార్షికోత్సవం పురస్కరించుకుని అక్కడ పలు రకాల మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ఇళ్ల వద్ద నున్న ఖాళీ స్థలాల్లో తమకిష్టమైన మొక్కలను ప్రజలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ సురేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

– పలమనేరు

కుప్పంలో పట్టు సడలని బాబు

- వరుసగా ఎనిమిదోసారి విజయం
- టీడీపీ గెలిచినా వైఎస్సార్‌సీపీకి పెరిగిన ఓట్ల శాతం

కుప్పం: ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో మరోసారి గెలుపొంది తన పట్టును నిలుపుకున్నారు. 2024 ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో ప్రజల అంచనాలను తలకిందులు చేస్తూ బాబు తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. వరుసగా ఎనిమిదోసారి విజయం సాధించారు. 1989లో కుప్పం నియోజకవర్గం తొలిసారి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు పోటీ చేశారు. అప్పటి నుంచి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో ప్రతిసారీ గెలుపొందారు. దీంతో పాటు ఉమ్మడి రాష్ట్రానికి 1995లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పదేళ్ల పాటు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కొనసాగారు. అనంతరం 2004 జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ అధికారం కోల్పోయినా చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో 38,535 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 2009లో, 2019లోనూ గెలిచారు. ఈపర్యాయం సార్వత్రిక ఎన్నికల్లో 47,324 ఓట్ల మెజార్టీ సాధించారు. అదే సమయంలో 2014 నుంచి చంద్రబాబుకు ప్రత్యర్థిగా వైఎస్సార్ సీపీ పోటీ చేస్తోంది. తొలిసారి ఆయనపై విశ్రాంత ఐఏఏస్ అధికారి చంద్రమౌళి 2014లో చంద్రబాబుపై పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో 55,839 ఓట్లు సాధించినా ఓటమి చెందారు. అనంతరం 2019 ఎన్నికల్లో 69,424 ఓట్లు వైఎస్సార్‌కి రావడంతో 13585 ఓట్లు వైఎస్సార్ గ్రాఫ్ పెంచుకుంది. ప్రస్తుతం 2024 ఎన్నికలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కు 73,923 ఓట్లు వచ్చాయి. దీంతో ఈసారి ఎన్నికల్లో 4,299 ఓట్లు వైఎస్సార్ సీపీకి పెరిగాయి.

అలరించిన 'దుర్యోధన వధ'




యుద్ధ సన్నివేశంలో తలపడుతున్న భీమ, దుర్యోధన వేషధారులు

ఐరాల: మండలంలోని బెస్తపల్లె శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భాగవతారిణి వరలక్ష్మి హరికథా గానం అనంతరం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి యుద్ధం చేసే సన్నివేశం అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి మట్టి ప్రతిమ వద్ద సాగిన యుద్ధ సన్నివేశాలు కట్టిపడేశాయి. భీమ, దుర్యోధన వేషధారులు ఒకరిపై మరొకరు కలియబడుతూ, పద్యాలు ఆలపిస్తూ, సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటూ తమ పాత్రలను రక్తి కట్టించారు. వారి పద్యాలకు జనం చప్పట్లు, విజిల్స్‌తో హోరెత్తించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన జనంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. అనంతరం భీముని వేషధారి దుర్యోధనుడి మట్టి ప్రతిమ తొడపై గదతో మోదడం, దుర్యోధన వేషధారి విరుచుకు పడిపోవడంతో వధ ఘట్టం ముగిసింది. ఆలయ నిర్వాహకులు ప్రభాకర్, కిషోర్‌కుమార్, సురాజ్, వీరమణి, సుబ్రమణ్యం, వెంకటేష్, మనోహర్ పాల్గొన్నారు.

చారిత్రక చిహ్నం.. పాండురాజుల పార

- కొండపై అబ్బుర పరిచే రాతిగూళ్లు
- చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్న పారకొండ
- సినిమా మాటింగుల లొకేషన్‌లకు నెలవు


నగరి : మున్సిపల్ పరిధిలోని తిరుపతి జాతీయ రహదారి పక్కనే ఉన్న పాండురాజపురం గ్రామాన్ని ఆనుకుని పాండురాజులపార అనే కొండ ఉంది. ఈ కొండపై పురాణకాలంలో పాండవుల సంచరించారని అందుకే ఈ కొండకు పాండురాజుల పార అనే పేరు వచ్చిందని చారిత్రక ప్రసిద్ధి. వనవాస సమయంలో పాండవులు కొంతకాలం ఈ కొండపై నివాసం ఏర్పరచుకున్నట్లు ప్రతీతి. భూమట్టానికి 300 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండపై ఉన్న ఆనవాళ్లను పాండవులు సంచరించినందుకు గుర్తులు అంటారు. ఈ కొండపై పాండవులు నివశించడానికి కొండరాళ్ల మధ్య నిర్మించుకున్న రాతి గూళ్లు, పడుకోవడానికి కొండపై ఏర్పాటుచేసుకున్న పడకల చిహ్నాలు, భీముడు వాల్చిన పెద్దబండ, బండరాళ్ల మధ్య దారి, కొండగుహలు, ద్రౌపది స్నానమాడినట్లు చెప్పబడే చిన్న నీటి గుంట ఇలా ఎన్నో వింతలు ఉన్నాయి.



కొండరాళ్ల మధ్య నిర్మితమై ఉన్న రాతిగూళ్లు

దొంగలకు నిలయంగా.. !

ఈ రాతిగూళ్ల కాలక్రమేణా దోపిడీ దొంగలకు నివాసంగా మారాయని, వారు పలు ప్రాంతాల్లో దోపిడీ చేసుకుని వచ్చి ఈ కొండపై గూళ్లలో నివశించేవారని చారిత్రక కథనాలు ఉన్నాయి. కొండపై వింతలు చూడడానికి సమీప గ్రామ ప్రజలు తరచూ ఇక్కడకు వెళ్తుంటారు. ఎన్టీఆర్ నటించిన సతీ అనసూయ సినిమా, నాగార్జున నటించిన జానకిరాముడు, తమిళ నటుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన రాజాదిరాజ, ప్రభు నటించిన పాసకిళిగల్, అర్జున్ నటించిన కౌబాయ్ నెంబర్1 చిత్రాలను ఈ కొండపై చిత్రీకరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించే కొండచుట్టు ఉత్సవాల సమయంలో మున్సిపల్ పరిధిలోని సత్రవాడ, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, కేవీపీఆర్ పేట, కొత్తపేటకు చెందిన పలువురు ఇక్కడకు విచ్చేసి పొంగళ్లు పెట్టి వనభోజనాలు చేస్తారు. మిగిలిన సమయాల్లో ఆకతాయిలు మాత్రమే ఆ కొండపైకి వెళ్లి ఇష్టారాజ్యంగా వ్యవరిస్తుంటారు. కొండపైకి వెళ్లాలంటే కొండరాళ్లపై ఎక్కుతూ వెళ్లాల్సిందే. దారి సక్రమంగా లేకపోవడంతో పలువురు వింతలను చూడలేకపోతున్నారు. ఇప్పటికే పాండవులు పాచికలాడినందుకు గుర్తుగా ఉన్న బండ కొండపై నుంచి కిందకు దొర్లి శిథిలమైంది.



భీముడు వాల్చినట్లు చెప్పే బండరాయి

నాటు కోళ్లతో అదనపు రాబడి

గుడిపాల: ఒకప్పుడు మండలంలో నాటుకోళ్ల పెంపకం విరివిగా ఉండేది. అయితే రానురాను తగ్గిపోయింది. ప్రస్తుతం మళ్లీ వాటికి డిమాండ్‌తో పాటు ధర కూడా పెరిగింది. దీంతో నాటుకోళ్లకు ఆదరణ ఎక్కువగా ఉండడంతో ఎక్కువమంది వాటి పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. ఎక్కడ అమ్మినా వాటి ధర కూడా ఎక్కువగానే ఉంటుంది. గుడిపాలలోని చిత్తపార, అడవిచేను, వేలరాంబట్టి, చింతగుంటూరు, నారగల్లు, వెంగమాంబపురం ప్రాంతాల్లో నాటుకోళ్ల పెంపకం విరివిగా సాగుతోంది. ఎక్కడా నాటుకోళ్ల ఫారాలు లేకపోయినప్పటికీ మండల ప్రాంతాల్లో గ్రామాలు ఎక్కువగా ఉండడంతో దాదాపు పెంచే ఇళ్లలో 10నుంచి 20 కోళ్ల వరకు పెంచుతున్నారు. తక్కువధరకు నాటుకోళ్లను తెచ్చి పెంపకందారులు గృహ పరిసరాల్లో వదిలేస్తే చాలు అవే తిరుగుతూ పెరుగుతూ ఉంటాయి. దీంతో నాటుకోళ్ల పెంపకం దారులకు ఖర్చుకూడా తక్కువగానే ఉంటుంది. ఆదాయం ఎక్కువగా రావడంతో గ్రామాల్లో యువకులు కోళ్ల పెంపకానికి శ్రీకారం చుడుతున్నారు. కిలో బరువున్న నాటుకోడిని రూ.300నుంచి రూ.350వరకు అమ్ముతున్నారు. నాటుకోళ్లకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. బయటి నుంచి వస్తున్న కొనుగోలుదారులు కిలో మాంసం రూ.400 నుంచి రూ.500 వరకు కొనుగోలు చేస్తున్నారు. నాటుకోళ్లను కొనుగోలు చేయడానికి కొందరు వ్యాపారులు గ్రామాలకే వచ్చి పట్టణాలకు వాటిని తీసుకువెళ్లి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.. నాటుకోళ్లకు డిమాండ్ దృష్ట్యా గ్రామాల్లో ఎక్కువమంది ఇళ్ల వద్దనే వీటిని పెంచుతున్నారు.



పరిసరాల్లో తిరుగుతున్న కోడి పిల్లలు

చెల్లాటమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని రెడ్డివారి కుప్పం గ్రామంలో వెలసిన చెల్లాటమ్మకు ఆదివారం వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని ఆలయ అర్చకులు సుప్రభాతసేవతో మేల్కొల్పి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనంతో అభిషేకాలు చేశారు. గ్రామస్తులు అమ్మవారికి కొత్త దుస్తులు, వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామస్తులు వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించి ఉయ్యాల సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జయశంకర్‌కు అరుదైన గౌరవం

తిరుపతి సిటీ : ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్‌కు అరుదైన గౌరవం లభించింది. థాయ్‌లాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ ఆయనకు జీవితకాలపు సభ్యత్వం కల్పించింది. దీంతో ఆయన ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతదేశపు భౌతిక శాస్త్రవేత్తగా చరిత్ర సృష్టించారు. థాయ్‌లాండ్ వేదికగా ఈనెల 5వ తేదీ నుంచి 7వరకు జరిగిన సియా ఫిజిక్స్ కాంగ్రెస్–2024 కార్యక్రమంలో ఆయన అధ్యక్షత వహించి కీలకోపన్యాసం చేశారు. కార్యక్రమం ముగింపు రోజున ఆయనకు ఫిజిక్స్ అసోసియేషన్ చెందిన కింగ్‌మొంగ్ కుట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ విసను పెచరసా, నఖోన్ పాతోమ్ రాజాభట్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ జక్రాపొంగ్ కైనోఖావో జీవితకాల సభ్యత్వాన్ని ఆయనకు అందజేశారు.



థాయ్‌లాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ సభ్యులతో విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ

రేణిగుంట: మండలంలో అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు సంభవించినప్పుడు నష్ట నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలని గాజులమండ్యం ఎస్ఐ సునీల్ పిలుపునిచ్చారు. మండలంలోని గాజులమండ్యం సమీపంలోని ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ కోకో స్టేషన్‌లో ఆదివారం అగ్నిమాపక సిబ్బందితో గ్యాస్ లీకేజీ, అగ్నిప్రమాదాలపై లెవల్–3 మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లను ఇతర ప్రాంతాలకు తీసుకెళుతున్నప్పుడు గ్యాస్ లీకేజీ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఏజీ అండ్‌పీ ప్రథమ్ సంస్థ రీజనల్ హెడ్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ గ్యాస్ లీకేజీ అయి ప్రమాదం సంభవిస్తే విపత్తు తీవ్రత ఎక్కువ కాకుండా ఎలా వ్యవహరించాలో వివరించారు.

అమరన్నకు మళ్లీ మంత్రి యోగం?

- జిల్లా నుంచి పరిశీలనలో అమరనాథ్‌రెడ్డి పేరు
- గతంలో పరిశ్రమల శాఖ మంత్రి.. ఇప్పుడే శాఖ ఇస్తారో?
- మంత్రి పదవి ఖరారైందని పేర్కొంటున్న టీడీపీ శ్రేణులు

పలమనేరు: మాజీ మంత్రి, పలమనేరు తాజా ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డికి కొత్త మంత్రి మండలిలో స్థానం దక్కడం ఖాయమని స్థానికంగా ఆ పార్టీ క్యాడర్‌లో వినిపిస్తోంది. గతంలో ఆయన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా గెలిచి ఆపై టీడీపీలో చేరి 18 నెలల పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రిగా పనిచేశారు.



అమరనాథ్‌రెడ్డి

2019 ఎన్నికల్లో ఇక్కడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎన్ వెంకటేగౌడపై పరాజయాన్ని చవిచూశారు. ఆపై నియోజకవర్గంతో పాటు జిల్లాలో టీడీపీకి పెద్దదిక్కుగా మారి పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. కుప్పంలో ప్రారంభమైన లోకేష్‌బాబు జనగళం పాదయాత్ర ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలో ఈ కార్యక్రమం ముగిసేవరకూ అన్నీ తానై వ్యవహరించారు. దీంతో పాటు లోకేష్‌తో ఆయనకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లానుంచి మంత్రి పదవి దక్కించుకునేందుకు అమరనాథరెడ్డితో పాటు పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి పేరు వినిపిస్తున్నప్పటికీ మాజీ మంత్రి అమర్‌కే మళ్ళీ మంత్రి పదవిపొందడం గ్యారంటీ అని ఆ పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. మరోవైపు అమరనాథ్ రెడ్డికి మంత్రి పదవి ఇప్పటికే ఖరారైందని ఆ పార్టీ క్యాడర్ సంబరాలకు సన్నద్ధమవుతోంది.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గడువు దాటితే ముప్పు తప్పదు
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ /బంగారుపాళెం : గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో, సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ విషయాన్ని తెలుసుకుని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో ఉంటుంది. గడువు తేదీని ప్రతి సిలిండర్ పై ఖచ్చితంగా మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తారు. సిలిండర్‌ను మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని అప్రమత్తంగా వినియోగించాల్సి ఉంటుంది.

గుర్తించడం ఇలా..

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్ పై ఏ–24, బీ–24 అని ఉంటే... ఆ సిలిండర్ 2024 మార్చికి గడువు ముగిసిపోతుందని అర్థం. 24 అంకె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగుస్తుందని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దు

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్ పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే ఆ సిలిండర్‌ను తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్ అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంటుంది.

పదేళ్ల గడువు

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేక మైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తరువాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

ప్రజల్లో చైతన్యం

గృహాల్లో అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు సంభవించినప్పుడు నష్ట నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రతి సంవత్సరం అవగాహన కల్పిస్తుంటారు. ఈ మేరకు విద్యాసంస్థలు, కాలనీల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తుంటారు. గ్యాస్ సిలిండర్లను ఇతర ప్రాంతాలకు తీసుకెళుతున్నప్పుడు గ్యాస్ లీకేజీ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరిస్తారు. గ్యాస్ లీకేజీ అయి ప్రమాదం సంభవిస్తే విపత్తు తీవ్రత తగ్గించేందుకు ఎలా వ్యవహరించాలో సూచనలు చేస్తారు. ప్రమాదం ఎదురైనప్పుడు వేగంగా ప్రతిస్పందించడంతోపాటు చురుకైన ఆలోచనతో తీవ్రతను నియంత్రించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తారు. అనంతరం ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రమాదం జరిగినప్పుడు ప్రతిస్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ రీజనల్ హెడ్ సందీప్ మిస్త్రి, ఆపరేషన్స్ మేనేజర్ డి.శ్రీను, సేఫ్టీ ఆఫీసర్ శబరి బాబు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



సిలిండర్‌పై గడువు తేదీ డి-26 (డిసెంబర్ 2026)

వినియోగదారుడి హక్కులు

- గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కొన్ని హక్కులు ఉన్నాయి.
- గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు.
- కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు.
- కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలని డీలర్లు కోరవచ్చు. అయితే డీలర్ల వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు.
- గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



చంద్రగిరి(తిరుచానూరు): వేసవి సెలవుల నేపథ్యంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన పలు నాట్యసంస్థల ఆధ్వర్యంలో నాట్య గురువు సుజేందర్ బాబు నేతృత్వంలో భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో భాగంగా అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజు కీర్తనలు, ఆంధ్ర జానపద నృత్యాలు, తరంగం కూచిపూడి అంశం, కృష్ణ నృత్యం తెలంగాణ వంటి పాటలకు కళాకారులు తిరుపతికి చెందిన భవ్యశ్రీ బృందం, బెంగళూరుకు చెందిన దివ్యపాలక్షబృందం, శృతి శంకర్ బృందం, హైదరాబాద్‌కు చెందిన నటరాజ నాట్యాలయం కూచిపూడి, బ్లూమింగ్ డేల్ నాట్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, తిరుపతి లలితాంబిక నృత్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, నాట్యరవళి డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో భరతనాట్యం, నటరాజ నృత్యాలయం ఆధ్వర్యంలో భరత నాట్యం, తీక్షణ భరతనాట్యం, హైదరాబాద్‌కు చెందిన సువర్ణ బృందం భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడు రాష్ట్రాలకు చెందిన కళాకారులు విభిన్న సంస్కృతులకు చెందిన నాట్యాలు అలరించాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు తమ ప్రదర్శనతో అలరించారు. ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందించారు. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.